మంచి స్నేహితులుగా మిగిలిపోదాం. ఇదే నా నిర్ణయం. -పద్మ."

ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు విశ్వనాథ్. అతడి మనసు బరువెక్కింది. ఆలోచన కదలటం లేదు. అలా స్తబ్దంగానించున్నాడు.

"నమస్కారం సార్, డాక్టరు గారూ ! ఎక్కడికో ప్రయాణమైనట్టున్నారు ?" తల పక్కకు తిప్పి చూశాడు విశ్వనాథ్. సంచి చేతిలో పట్టుకుని కనిపించాడు ఎర్రిమల్లయ్య. అతణ్ణి చూడగానే వుత్సాహం లాంటిది కలిగింది విశ్వనాథ్‌లో.

"బ్రహ్మపట్నం వెళ్దామని బయలుదేరాను." అన్నాడు చిన్నగా నవ్వుతూ బిక్కమొగం వేశాడు ఎర్రిమల్లయ్య.

"బ్రహ్మపట్నం వెళ్ళడమేమిటి ?"

"అదేం అట్లా అడుగుతున్నారు ? బ్రహ్మపట్నానికి మీరు దారి చెబుతారట కదా ? సత్యనారాయణ చెప్పాడు." అన్నాడు విశ్వనాథ్.

"అయితే సత్యనారాయణ పొరబాటు పడ్డాడన్నమాట. బ్రహ్మ పట్నానికి నేను దారి చెప్పలేను. అసలు ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే, దారి లేదు కనక." పక్కున నవ్వాడు విశ్వనాథ్.

దారి లేదంటే, బ్రహ్మపట్నం లేనట్టేగా !" లాజికల్ ప్రిన్సిపుల్ పట్టుకొని, నా చేతికి చిక్కావు చూడు అన్నధోరణిలోకి దిగాడు విశ్వనాథ్.

"అట్లా అనకండి. మన చుట్టూ వున్న ఈ ప్రపంచమంతా బ్రహ్మపట్నమే. మనం మన ఆలోచనలతో, ఊహలతో, కోరికలతో, లేనిపోని ఆశయాలతో, ఆదర్శాలతో బ్రహ్మపట్నాన్ని సృష్టిస్తాం. ఈ రెండింటికీ ఎప్పుడూ పొత్తుకుదరదు."

వినయంగా అన్నాడు ఎర్రిమల్లయ్య.

"బ్రహ్మపట్నమే తెలియాలి అంటే మరి మనమేం చెయ్యాలి ?" తనలో తెలియని అయోమయత, అసంతృప్తి అనుకోకుండా ఈ ప్రశ్నలోకి దించింది విశ్వనాథ్‌ను.


"చేసేందుకేమీ లేదు. ఈ లోకం తాను వున్న తీరునే వుంటుంది తప్ప మన వూహ ప్రకారం, మనం ఆశించే ప్రకారం వుండదు అని గ్రహించి మన వని మనం చేనుకుపోవడమే. కిటికీలోంచి దూరంగా చూస్తే దృశ్యమంతా ఏదో కొత్త కాంతితో, వింతగా కనిపిస్తుంది. బయటకు వెళ్ళి చూస్తే అది కేవలం తానున్న తీరునే వుందని తెలుస్తుంది. ఎప్పటికప్పుడు మారుతూవుండే బ్రహ్మపట్నానికి మనం దారి ఏర్పర్చుకుని విఫలమయ్యాక కానీ దారి లేదనే విషయం అర్థం కాదు. అంతవరకూ మనం ఏదో సాధించబోతున్నట్టు ప్రత్యేకమైన వ్యక్తిగా భావిన్తూ వస్తాం.. అయ్యా డాక్టరుగారూ ! క్షమించండి. ధర్మవరం బస్సు వచ్చింది. నేను వెళ్తున్నాను."

అంటూ పరుగులాంటి నడకతో బస్సువైపు వెళ్ళాడు ఎర్రిమల్లయ్య.

"నేనూ వెళ్తున్నా ! అదిగో టౌన్ బస్సు వచ్చింది" అని గట్టిగా అంటూ బస్సువైపు నడిచాడు విశ్వనాథ్. పందలకుంటలో తాను పనిచేయటంలోనే కాదు, పద్మ ప్రేమలో కూడా తాను బ్రహ్మపట్నాన్ని చూశానా, లేదా అని ఆలోచన విస్తరించటంతో అడుగులు మెల్లగా సాగాం.

## ప్రస్తావన

**కె.వి.ఎస్.వర్మ**



**స్మారక కథలు**

గోదావరి గలగలా ప్రవహిస్తోంది. ఛార్మినార్ సిగరెట్టు కాలుస్తున్న కవికుమారునికి ఆ పొగ ఘుమఘుమగానే వున్నట్టుంది. గోదావరి గట్టు గచ్చు చప్టామీద ఏడెనిమిది మంది మిత్రులు కూర్చున్నారు.

వాళ్ల మధ్య మౌనం రాజ్యమేలుతోంది. వాళ్లు గోదావరి వంక చూస్తున్నారనుకుంటే నీళ్లల్లో మందుపోసినట్టే. వాళ్ల కళ్లు శూన్యంలోకి చూస్తున్నాయి. ఓ పావుగంట గడిచింది.

"శ్రీశ్రీ అన్నట్టు, ఈ జీవితాలు ఎగరేసిన గాలిపటాలు, కనిపించని చెయ్యేదో విసిరేసిన జాతకాలు" అన్నాడు కొటేషన్‌రావు. (అతని అసలు పేరు కోటేశ్వర్రావు).

మిగతా వాళ్లు ఉలిక్కిపడ్డారు.

"నేనొప్పుకోను" అన్నాడు జగదీష్.

"ఒప్పుకునే పరిస్థితులొచ్చాయి"అన్నాడు కవికుమారుడు.

"ఎలాంటి పరిస్థితులొచ్చినా సరే" అన్నాడు జగదీష్.

కవి కుమారుడు కళ్లు మూసుకుని, చిన్న రాగం తీసి, కళ్లు తెరిచి, "మిత్రమా, డిసెంబరు 31న తప్ప, ఇన్నేళ్లలో ఇంతమందిమి ఈ గట్టుమీద ఎప్పుడైనా కలిశామా" అన్నాడు. ఆ మిత్రునితో పాటు మిగతా మిత్రులూ 'లేద'న్నట్టు తలలూపారు.

"అలాంటప్పుడు మన కొటేషన్‌రావు చెప్పిందానికి ఒప్పేసుకుంటే తప్పేముంది" అంతా సైలెంటయిపోయారు మళ్లీ.

"మన్ను తిన్న పాములాగున్నాడు అని ఓ కథలో రాసేను చాలా కాలం క్రితం. ఇప్పటికి అనుభవంలో కొచ్చింది" అన్నాడు కథల్రాజు. మిగతావాళ్లంతా అతని వేపు చూసేటప్పటికి కథల్రాజు గోదావరి వంక చూస్తున్నాడు. అతనికీ గోదావరి శూన్యంలాగే వుంది.

"ప్రేయసీ గృహవీధి స్పృహ తప్పిపడిపోయి, ముదిత కాలి గురుతు ముద్దుగొంటి"

"అలాంటివి జ్ఞాపకం చెయ్యకోయ్"

"ఇవేళ కొటేషన్‌రావు గొంతు మధురంగా లేదు"

"మధువు పడని గొంతు మధురంగా ఎలా వుంటుందోయ్ బుద్ధిహీనుడా" అన్నాడు కొటేషన్‌రావు కళ్లు చికిలించి.

"ఔను నిజం ఔను నిజం, ఔను నిజం నీవన్నది, నీవన్నది నీవన్నది నీవన్నది నిజంనిజం"అన్నాడు కవికుమారుడు.

"లేదు సుఖం లేదు సుఖం, లేదు సుఖం జగత్తులో" అన్నాడు కథల్రాజు.

"కథల్రాజుగారూ కవిత్వం చదువుతున్నారే" అన్నాడు కవికుమారుడు.

"కవి కుమారులూ కథలు చెబుతుంటారుగా"

"జగత్తులో అనే మాట మన పరిస్థితికి అతకదేమో... తెలుగుదేశంలో అంటే చాలేమో"

"ఔను నిజం ఔను నిజం నీవన్నది నిజం నిజం... లేదు సుఖం లేదు రసం, చేదువిషం జీవఫలం..."

"కవీ, శ్రీశ్రీ కవిత్వం పాటడమేనా, నీ కవిత్వం చెప్పేదేమన్నా వుందా" అడిగాడు శాస్త్రి.

"కవిత్వమొక తీరని దాహం..."

"కవీ, నీ కవిత్వం గురించి అడుగుతున్నా"

"కొన్నాళ్లదాకా ఆ విషయం ఎత్తకు శాస్త్రీ.

"ఎన్నాళ్లదాకా"

"కొన్నాళ్లదాకా అన్నానా"

"అదే, ఎన్నాళ్లదాకా అని అడుగుతున్నానా"

"నువ్వొకడివి. పట్టుకుంటే ఒక పట్టాన వదలవు. ఇప్పట్లో రాయలేను"

"పోన్లెండి. మీకూ దేశ భక్తి పుట్టుకొచ్చినట్టుంది" అన్నాడు కథల్రాజు.

"దేశ భక్తా" అన్నాడు కవికుమారుడు తెల్లబోతూ.

"ఇప్పట్లో రాయలేనన్నారు కదా. అంటే తెలుగుదేశంలో కొందరికన్నా కొంతకాలందాకా మీ బాధ వుండదు కదా" అన్నాడు కథల్రాజు నవ్వుతూ.

"హు..." అన్నాడు కవికుమారుడు కన్నెర్రజేస్తూ.

"ఉడికిపోకండి కవికుమారా. సరదాకన్నాను"

"నిజంగా అన్నారనుకున్నానే" అన్నాడు నాయుడు.

కవికుమారుడు ఛార్మినార్ సిగరెట్ వెలిగించాడు. గోదావరి గలగలా ప్రవహిస్తూనే వుంది.

మిత్రులందరూ మళ్లీ మునులయిపోయారు. వీధిలైట్ల కాంతి గట్టుమీదా, గోదావరి మీదా పడుతోంది. ఆ మేరకు గోదావరి కెరటాలు చీకటి వెలుగుల్లా వున్నాయి.

పాత రైలు బ్రిడ్జి మీదనుంచి ఏదో ప్యాసింజరు రైలు మన్నుతిన్న పాములా వస్తోంది.

"ఈ దుఃఖాన్ని, ఈ కష్టాన్ని భరించలేను. నా కొడుకు నాకు కాకుండా పోయాడు అని ఒకావిడ భోరున విలపించిందట. ఆమెకు గుప్పెడు నువ్వుల గింజలిచ్చి, ఒకో ఇంటికీ వెళ్లి ఒకో నువ్వుల గింజ ఇచ్చి, నువ్వు దుఃఖం లేకుండా వున్నావా అని అడిగిరా అన్నాడట బుద్ధుడు. ఇంటింటికీ తిరిగి తిరిగి కనుక్కుని వచ్చిందట. దుఃఖం ఎరుగని వాళ్లెవరూ లేనేలేరట" అన్నాడు కవికుమారుడు నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

"ఆ జాతకకథ ఇప్పుడెందుకు చెప్పినట్టు"

"చెప్పింది కవికుమారులు కదా. ధ్వని వుంటుంది"

"కథల్రాజా వారన్నది నిజమే. పాపం ఆవిడ ఆ సత్యం తెలుసుకోవడానికి కాళ్లరిగేలా ఎన్ని ఇళ్లో తిరిగి వుంటుంది. ఆవిడ ఇప్పుడు మన దగ్గరి కొస్తే అన్ని ఇళ్లు తిరిగే శ్రమ తప్పేది కదా" అన్నాడు కవికుమారుడు.

"బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్" అంటూ అందుకున్నాడు కొటేషన్‌రావు.

ఖంగుఖంగున దగ్గి "అదంత సులువేం కాదు" అన్నాడు కవికుమారుడు.

హైదరాబాద్ వెళ్లే గౌతమీ ఎక్స్‌ప్రెస్ రోడ్ కమ్‌రైలు బ్రిడ్జి మీద కొచ్చేసింది.

"ఇంటికి పోవాలి" అంటూ నాయుడు లేచాడు

దాంతో అంతా లేచారు. గోదావరి గట్టుదిగి రోడ్డు మీద కొచ్చారు. "మళ్లీ రేపు సాయంత్రం ఆరు గంటలకి కలుసుకుందాం" అని ఎవరూ ఎవరితోనూ అనలేదు. "రాక చస్తామా" అని ఎవరికి వాళ్లు తమలో తాము అనుకున్నారు. 1995, జనవరి 17వ తేదీ వాళ్లకలా గడిచింది.

కొటేషన్‌రావు జనాంతికంగా అన్నాడు-

"మందు మిథ్య"

**(వచ్చే వారం: తొలికథ- అతి)**